క్లుప్తంగా

పరిశీలన

రాజాం: మండలంలోని ఒమ్మి గ్రామంలో ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు, ఏపీఓ సాయిరామ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రూ. 6 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయని ఎంపీడీఓ తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

బాడంగి: జిల్లాలోని కిల్లంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులు పరీక్ష రాశారని సెంటర్ చీఫ్ సత్యనారాయణ తెలిపారు.

కుష్టువ్యాధి నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్యామలాకుమారి

రేగిడి: కుష్టువ్యాధి నిర్మూలన అందరి బాధ్యతని ఎంపీడీఓ శ్యామలాకుమారి అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన సమావేశంలో వైద్యాధికారులు సీహెచ్.అసిరినాయుడు, సోహిణీ రాఘవ్‌లతో కలిసి ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటింట సర్వే జరిపి, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి జాగ్రత్తలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుందరేశ్వరరావు, హెచ్ఎస్ అప్పారావు, పుష్ప, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

సంతకవిటి: సంతకవిటి – రాజాం ప్రధాన రహదారిలో రోడ్డుకిరువైలా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆర్. గోపాలరావు జేసీబీ సహాయంతో శనివారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. తుప్పలు తొలగించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాజాం సిటీ: మండల పరిధిలోని గుయ్యానవలసలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. తీసిన మురుగును ఆరుబయటకు తరలించే ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే బ్లీచింగ్ చల్లించడంతో పాటు మలాథియాన్ స్ప్రే చేయించాలన్నారు. కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

క్షయవ్యాధిపై అవగాహన



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

సంతకవిటి: క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాల్తేరులో శనివారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో టి.వేణుగోపాల్, టీబీ సూపర్‌వైజర్ పి.చిన్నవాడు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం

వంగర: చెత్త నుంచి సంపద సృష్టించే షెడ్డుల నిర్మాణం వేగవంతం చేయాలని ఈఓపీఆర్‌డీ కె.రామారావు అన్నారు. మండల పరిధిలోని శివ్వాం గ్రామంలో నిర్మాణంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

రేపటి నుంచి పశువైద్యశిబిరాలు

మెంటాడ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 20 నుంచి 31 వరకు ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి అవినాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ రెండు పంచాయతీల పరిధిలో రెండు బృందాలు శిబిరాలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. 20న కుంటినవలస, ఆగురు.. 21న పెద్ద మేడపల్లి, ఇద్దనవలస.. 22న జక్కువ, కోంపంగి.. 23న ఉద్దంగి, గుర్ల తమ్మిరాజుపేట.. 24న కూనేరు, అమరాయవలస.. 25న బుచ్చిరాజుపేట, పిట్టాడ.. 26న గుర్రమ్మవలస, కంటుభుక్తవలస.. 27న బడేవలస, జయితి.. 28న పెద్దచామలాపల్లి, మీసాలపేట.. 29న చింతలవలస, గుర్ల.. 30న ఇప్పలవలస, లోతుగెడ్డ.. 31న కొండలింగాలవలస, ఆండ్ర పంచాయతీల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట మార్పిడితో ఉత్తమ ఫలితాలు..



పంట మార్పిడి చేయడంతో ఏపుగా పెరిగిన వంగ పంట

- ప్రతి ఏడాదీ ఒకే పంట సాగుతో అనర్థాలు
- మిశ్రమ పంటలతో చీడపీడల నుంచి రక్షణ

రామభద్రపురం:

రైతులు ఏటా సాగు చేసే పంటల్నే మళ్లీ మళ్లీ వేస్తుండడంతో భూమిలో సారం తగ్గిపోతుంది. పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు కూడా తగ్గి తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. పంట మార్పిడి లేకపోవడంతో చీడపీడలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది. లాభదాయకంగా ఉండే వాణిజ్య పంటలను రైతులు ప్రతి సీజన్‌లో క్రమంగా సాగు చేస్తుండడం వల్ల భూసారం క్షీణిస్తోంది. రెండు, మూడు సంవత్సరాలకొకసారైనా పంట మార్పిడి చేస్తే చీడపీడలను అదుపులో ఉంచే అవకాశం ఉంటుంది. పంట మార్పిడితో భూమిలో నీటి నిల్వలు పెరిగి భూసారం పెరిగి చీడపీడలు దూరమవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో పలు సూచనలు, సలహాలు అందించారు.

పంట మార్పిడితో లాభదాయకం..

నేను ప్రతీ ఏడాది వరి పంట సాగు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాను. నాలుగైదేళ్లుగా పంట మార్పిడి చేస్తున్నాను. ఒక ఏడాది మొక్క జొన్న, మరో ఏడాది కూరగాయలు, ఇంకో ఏడాది పత్తి సాగు చేయడం వల్ల దిగుబడులు పెరిగి లాభదాయకంగానే ఉంది.మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉంటే కూరగాయల పంటలపై మంచి లాభాలు వస్తాయి.

– చింతల అప్పలనాయుడు, రైతు, రామభద్రపురం

అధిక దిగుబడులు..

పంట మార్పిడి విధానం వల్ల భూమిలో నాణ్యతతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే పంటల మార్పిడితో మొక్కల వేర్ల బుడిపెలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని స్థిరీకరించి నేలను సారవంతం చేస్తుంది. మార్కెట్‌లో పంటకున్న డిమాండ్‌ను బట్టి పంట మార్పిడి చేసుకుంటే ధర స్థిరీకరణ ఉంటుంది. ఉత్తమ ఫలితాలు సాధించొచ్చు.

– పి. మోహనకృష్ణ, మండల ఉద్యానశాఖాధికారి, రామభద్రపురం



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల ఉద్యానశాఖాధికారి మోహనకృష్ణ

పంట మార్పిడి వల్ల లాభాలెన్నో..

- చీడపీడల్ని అదుపులో ఉంచొచ్చు.
- ఒక పంటను ఆశించే చీడపీడలు రెండో పంటకు అంతగా ఆశించవు.
- పంట మార్పిడిలో రెండు లేదా మూడు పంటల్ని అంతర పంటలుగా పండించడం వల్ల ఏదైనా ఒక పంటకు గిట్టుబాటు లేకున్నా మరో పంట వల్ల నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు.
- పంటల మార్పిడితో వివిధ పంటల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు.
- సస్యరక్షణ కోసం వాడే పురుగు మందులు ఖర్చు తగ్గుతుంది.
- వేర్లు భూమిలో తక్కువ లోతుకు చొచ్చుకుని పోయే పైర్లతో పాటు వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకుని పోయే పైర్లు ఒకేసారి వేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ పోషకాలను సమర్థవంతంగా వినియోగించబడతాయి.
- పత్తి వేసిన పొలంలో మినప పంట వేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో సాగు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- మిరప పంట సాగు చేయడానికి ముందు భూమిలో జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి బాగా కలియదున్నాలి.
- నులి పురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే వాటిని ఎంపిక చేసుకోవాలి.
- వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము పంటలు నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి పంట తర్వాత పప్పు ధాన్యాల పంటల్ని కాని నూనె గింజల పంటల్ని కాని సాగు చేయడం వల్ల వరిని తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి.
- తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటల్ని సాగుచేసుకోవచ్చు.
- వేరుశనగ, కంది, పప్పు శనగ, తదితర తృణ ధాన్యాల్ని సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవుతుంది.

శతశాతం ఈ క్రాప్ నమోదే లక్ష్యం



ఆన్‌లైన్‌లో ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ నమోదు శతశాతం పూర్తి చేయడమే లక్ష్యమని వ్యవసాయాధికారి కె.శిరీష అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఈ క్రాప్ నమోదును శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి, మినుము, పెసర, మొక్కజొన్న పంటలు 1500 ఎకరాల్లో సాగు చేస్తుండగా.. 1200 ఎకరాలకు సంబంధించి ఈ క్రాప్ పూర్తయిందన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పది వేల మెట్రిక్ టన్నులు కాగా.. పది వేల అరవై ఆరు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. గతేడాది 9,800 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు చెప్పారు.

ఘనంగా జీవిత బీమా జాతీయీకరణ దినోత్సవం

రాజాం: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద జీవిత బీమా జాతీయీకరణ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ.. అనేక ప్రైవేట్ కంపెనీల దుశ్చర్యలకు చెక్ పెడుతూ అప్పటి ప్రభుత్వం దేశీయ బీమా రంగాన్ని జాతీయకరణ చేసిందన్నారు. డబ్బై సంవత్సరాలుగా జీవితా బీమా కంపెనీ ఎంతో మందికి ఆర్థిక చేయూత అందించందని తెలిపారు. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం బీమా రంగాన్ని ప్రైవేటీకరించేందుకు కుట్ర పన్నుతోందని చెప్పారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఎల్ఐసీని మరింత బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పి. ప్రభాకరరావు, కార్యదర్శి ఎం.జితేంద్రరావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కనులపండువగా బాల అన్నమ్మ యాత్ర



సంతకవిటి మండలంలోని సురవరంలో బాల అన్నమ్మ యాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం, విశాఖపట్నం, మన్యం, తదితర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. – సంతకవిటి

విశ్వశాంతి దినోత్సవం..



బొబ్బిలి పట్టణంలోని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విద్యాలయంలో శనివారం విశ్వశాంతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశాఖ జోన్ రాజయోగి బీకే నారాయణ బాబా శాంతి కార్యక్రమాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొబ్బిలి యూనిట్ ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరి, పూసర్ల శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. – బొబ్బిలి

ప్రయాణికులతో కిటకిట..



సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణమవుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా ప్రయాణికుల సందడే కనిపిస్తోంది. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో శనివారం కళకళలాడింది. ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు, కార్లు, జీపుల్లో ప్రయాణికులు కిక్కిరిసి రాకపోకలు సాగిస్తున్నారు. – రామభద్రపురం

గ్రీవెన్స్‌సెల్‌ను సద్వినియోగం చేసుకోండి

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ



వినియోగదారునితో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

రాజాం సిటీ: విద్యుత్ సమస్యలపై నిర్వహించనున్న గ్రీవెన్స్‌సెల్‌ను బాధిత వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో వినియోగదారుల గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన చంద్రశేఖరరావు తాను షెడ్యూల్ కులానికి చెందినప్పటికీ, విద్యుత్ బిల్లు రూ. 30 వేలు పెండింగ్‌లో ఉందని చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులు స్పందించి అతని మీటర్ తనిఖీ చేయగా..ఎస్సీకి బదులు బీసీ అని పడడంతో అతనికి రావాల్సిన రాయితీలు అందలేదని.. ఇది పంచాయతీలో జరిగిన పొరపాటుగా గుర్తించి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం మరికొంతమంది పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ..గ్రీవెన్స్‌లో తెలియజేసిన సమస్యలను 60 రోజులలో పరిష్కరిస్తామని చెప్పారు. సమస్యల సత్వర పరిష్కారానికి 1912 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. బిల్లింగ్‌లో లోపాలు, విద్యుత్ మరమ్మతులు, మీటర్లు కాలిపోవడం, ఓల్టేజీ సమస్యలు, మీటర్లలో లోపాలు, కొత్త సర్వీసులు, అదనపు లోడు మంజూరు, యజమాని పేరు మార్పిడి, ఇతర మార్పిడి అంశాలు, తదితర అంశాలపై తమను సంప్రదించాలన్నారు. 2005 నుంచి ఇప్పటివరకు 8348 ఫిర్యాదులు రాగా 8242 పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు షేక్ బాబర్, మసిలామణి, ఎస్.మురళీకృష్ణ, ఎ.డి ఫణీంద్రకుమార్, ఏఈ ఓజేసీఏ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు శాంతియుతంగా మెలగాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై షేక్ శంకర్

వంగర: ప్రజలు శాంతియుతంగా మెలగాలని ఎస్సై షేక్ శంకర్ అన్నారు. మండలంలోని సంగాం గ్రామంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం, మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు.

స్పందించిన రక్తదాతలు..



రక్తదానం చేస్తున్న జనార్దనరావు, వారాణి రమేష్

రాజాం: అత్యవసర సమయంలో రక్తదాతలు స్పందించి ఒకరి ప్రాణాలు నిలబెట్టారు. వివరాల్లోకి వెళితే.. సంతకవిటి మండలం బొద్దూరు గ్రామానికి చెందిన వంజరావు ఈశ్వరరావు అనే వ్యక్తి తల్లి జి.అమ్మడు ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. వెంటనే ఆమెను రాజాం జీఎంఆర్ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. అయితే బి పాజిటివ్ బ్లడ్ కావాలని వైద్యులు చెప్పడంతో ఈశ్వరరావు వాట్సాప్ గ్రూపుల ద్వారా అభ్యర్థించారు. అరగంట సమయంలోనే రేగిడి మండలం లక్ష్మణవలస గ్రామానికి చెందిన మీసాల జనార్దనరావు, రాజాం పట్టణం అమ్మవారి కాలనీకి చెందిన వారణాశి రమేష్ వచ్చి రక్తదానం చేశారు. దీంతో రక్తదాతలను ఈశ్వరరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్, పెంకి చైతన్యకుమార్, కడగల నాగరాజు, తదితరులు అభినందించారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక సెంటినరీ కెనెడియన్ బాప్టిస్ట్ చర్చిలో సీబీసీఎస్ 70వ మహాసభ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు బాప్టిస్ట్ సంఘాల నుంచి 200 మంది సంఘ పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

2025 నుంచి 2029 వరకు పనిచేయనున్న కార్యవర్గంలో అధ్యక్షుడిగా పి.జార్జి ఎబినేజర్, కార్యదర్శిగా కె.కృపారావు, ట్రస్ట్ చైర్మన్‌గా హెచ్ఎస్ఎస్ పాల్, రికార్డింగ్ సెక్రటరీగా సీహెచ్‌జే ప్రవీణ్, క్రిస్టియన్ ట్రెనింగ్ చైర్మన్‌గా రెవ కె.రామారావు, ట్రెజరర్‌గా కేజేఎస్ ప్రేమ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులకు బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్ సంఘ విధివిధానాలు తెలియజేశారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. దీంతో అధికారులు వారి పరిధిలోని గ్రామాల్లో శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్.



బొబ్బిలి: స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



వంగర: మండల కేంద్రంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న వివిధ శాఖల అధికారులు



రాజాం: స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ చేస్తున్న అధికారులు



తెర్లాం: మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, మండల అధికారులు

భూముల రీ సర్వేకు సహకరించండి

- బొబ్బిలి ఆర్డీఓ రామమోహనరావు



భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తున్న బొబ్బిలి ఆర్డీఓ రామమోహనరావు

తెర్లాం:

మండలంలోని పణుకువలసలో చేపట్టనున్న భూముల రీసర్వేకి రైతులంతా తమవంతు సహకారం అందించాలని బొబ్బిలి ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామమోహనరావు అన్నారు. భూముల రీసర్వేకి సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు శనివారం గ్రామంలో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జి. హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో బొబ్బిలి ఆర్డీఓ రామమోహనరావు మాట్లాడుతూ..భూముల రీ సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే మండలంలోని పణుకువలసను పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి ముందుగా రీ సర్వే చేపడతామని చెప్పారు. భూముల రీసర్వే జరుగుతున్నప్పుడు రైతులంతా వారి భూముల వద్దకు వెళ్లి సర్వే అధికారులకు సరైన హద్దులు చూపించాలన్నారు. తహసీల్దార్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. రీసర్వేలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చందక సత్యనారాయణ, రీసర్వే డీటీ సాయికిరణ్, మండల సర్వేయర్ సాయికుమార్, ఆర్ఐ కృష్ణమూర్తి, స్థానిక వీఆర్ఓ, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.